# అభివృద్ధికే పట్టం కట్టాలి

- ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు జోగు రామన్న, జాదవ్ అనిల్
- భీంపూర్‌లో నాయకులు, కార్యకర్తలతో సమావేశం



**ఎమ్మెల్యే అభ్యర్థులు జోగు రామన్న, జాదవ్ అనిల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన రాజ్‌గోండ్ యువకులు**

భీంపూర్, అక్టోబర్ 27 : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పని చేసిందని, ఎన్నికల్లో అభివృద్ధి చూసి బీఆర్ఎస్‌కి పట్టం కట్టాలని, కాంగ్రెస్ ఓటు వేస్తే కరెంట్ కష్టాలు తప్పవని ఆదిలాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. శుక్రవారం భీంపూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బోథ్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి గొడాం నగేశ్ , బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ నిర్వహించిన, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి హాజరయ్యారు. కార్యకర్తలకు దిశానిర్ధేశనం చేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ నల్లచట్టాలతో రైతులకు వ్యతిరేకి అయి అబాసుపాలైందని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్ అవసరం లేదని, రైతుబంధును అడ్డుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం కేసీఆర్ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. బోథ్ నియోజకవర్గంలో మరింత అభివృద్ధికి కారు గుర్తుకు ఓటేసి జాదవ్ అనిల్‌ను ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీ, బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి నగేశ్ మాట్లాడుతూ భీంపూర్ మండలంలో 8090 మంది కుటుంబాలకు రైతుబంధు వస్తున్నదని ఇలా సగటున ప్రతి కుటుంబానికి సీఎం కేసీఆర్ రెండు పథకాలు ఇస్తున్నారని గుర్తుచేశారు. సమగ్ర అభివృద్ధికి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ మాట్లాడుతూ తాను గెలిచిన తర్వాత మండలంలో గోముత్రి రిజర్వాయర్, అర్లి చెరువు, కరంజి, గుబిడి రోడ్డు సహా మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణాత్మకంగా అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా మండలంలోని నిపాని ఎక్స్ రోడ్డు నుంచి భీంపూర్ వరకు బీఆర్ఎస్ కార్యకర్తలు ,యువకులు,రైతులు బైక్ ర్యాలీ తీశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ స్వాగతించారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు కుమ్ర సుధాకర్, తాటిపెల్లి రాజు, ఎంపీపీలు కుడిమెత రత్నప్రభ ,తుల శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా ప్రతినిధి, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న , బీఆర్ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య యాదవ్, సర్పంచ్‌లు, నాయకులు బక్కి సురేందర్, గోవర్ధన్‌యాదవ్, నరేందర్‌యాదదవ్, షేక్ అఫ్రోజ్, జహూర్ అహ్మద్, సంజీవ్‌రెడ్డి , మొట్టె కిరణ్, మార్సెట్టి అనిల్, కల్పాప్‌యాదవ్ ,కపిల్, వివిధ గ్రామాల కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరిన 230 మంది గిరిజన యువకులు**

భీంపూర్‌లో ఎంపీపీ కుడిమెత రత్నప్రభ సంతోష్ , సర్పంచ్ మడావి లింబాజీల ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన సూర్యవంశీ రాజ్‌గోడ్, 130 మంది, బేల్సరిరాంపూర్‌కు చెందిన 100 మంది కాంగ్రెస్, బీజేపీల నాయకులు, గిరిజన యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి గొడాం నగేశ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, అభ్యర్థి జాదవ్ అనిల్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు.

తాంసి, అక్టోబర్ 27: తొమ్మిదేండ్లలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జడ్పీటీసీ తాటిపల్లి రాజు, ఎంపీపీ సురకుంటి మంజులాశ్రీధర్ రెడ్డితో కలిసి ప్రచారం చేశారు. ప్రచారానికి వచ్చిన జాదవ్ అనిల్‌కు మహిళలు మంగళ హారతులతో బ్రహ్మరథం పట్టారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఓట్ల కోసం ప్రజలను మోసగించడానికి కాంగ్రెస్, బీజేపీ నాయకులు వస్తారని వారిని తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు స్వప్న రత్నప్రకాశ్, కన్వీనర్ తారూడి అరుణ్‌కుమార్, వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ రఘు, నాయకులు రజినీకాంత్ రెడ్డి, లింగారెడ్డి, పరమేశ్, గోవర్ధన్ రెడ్డి, సిరిగిరి దేవేందర్, ఖమర్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ ధనుంజయ్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు దయానంద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

- ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి



**భైంసా: ముథోల్ మాజీ సర్పంచ్ అనిల్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే విఠల్ రెడ్డి**

భైంసా, అక్టోబర్, 27 : బీఆర్ఎస్ హయాంలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా భైంసా మండలం ఆష్టా గ్రామంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఓటర్లకు బీఆర్ఎస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతికి అనేక పథకాలను ప్రవేశపెట్టి దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని స్పష్టం చేశారు. మరోసారి ప్రజలు బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలని కోరారు. ప్రతిపక్షాలు చెబుతున్న మాటలను నమ్మి మోసపోవద్దని, కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను మరింత అభివృద్ధిలోకి తీసుకుపోదామని కోరారు. బీఆర్ఎస్‌లో ముథోల్ మాజీ సర్పంచ్ చేరిక ముథోల్ మాజీ సర్పంచ్ అనిల్ దాదాపు 50 మంది అనుచరులతో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు, ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి పార్టీలోకి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ మాజీ సురేందర్ రెడ్డి, ఆష్టా సర్పంచ్ సుకన్య రమేశ్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్, ఎంపీటీసీలు పోశెట్టి, ఆత్మ స్వరూప్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు నిలిపేందుకు కాంగ్రెస్ కుట్ర

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న
- బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు



**ఎదులాపురం : పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న**

ఎదులాపురం, అక్టోబర్ 27 : ఓటమి భయంతో సంక్షేమ పథకాలను నిలిపేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో యువనాయకుడు గణేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి గ్రామానికి చెందిన కిరణ్‌రాహుల్, గణేశ్, బీజేపీ నాయకులు, యూత్ సభ్యులు, సుమారు 100 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు బంధు, రుణమాఫీ పథకాన్ని నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. గతంలో రైతులకు మూడు గంటల కరెంట్ ఇవ్వాలంటూ కాంగ్రెస్ పార్టీ రైతులపై ఎందుకు ఇంత కక్షపూరితంగా వ్యవహరిస్తుందో చెప్పాలన్నారు. గుజరాత్‌లో బీజేపీ ప్రభుత్వం రైతులపై లాఠీ చార్జీలు చేయడం ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారని తెలిపారు. ఇలాంటి మోసపూరిత పార్టీలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ కొత్త మ్యానిఫెస్టో ద్వారా ప్రతి కుటుంబానికి ఎల్ఐసీ బీమా రూ.5లక్షలు, రూ.400కే గ్యాస్ సిలిండర్, సౌభాగ్యలక్ష్మి ద్వారా ప్రతి మహిళకు రూ.3వేలు ఇవ్వనుందన్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలను ప్రజల హక్కుగా తీసుకోవాలని తమ ఓటును కారు గుర్తుకు వేయాలని కోరారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు కనక రమణ, సుందర్శన్‌గౌడ్, ఎంపీటీసీ కిషన్, గంగయ్య, తిలక్, గణేశ్, రాము, సృజన్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీజేపీలను ప్రజానీకం నమ్మదు

భైంసా, అక్టోబర్, 27 : కాంగ్రెస్, బీజేపీ మాటలను రాష్ట్ర ప్రజానీకం నమ్మదని మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ అన్నారు. శుక్రవారం భైంసాలోని బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయమైన సంజీవ్ రెడ్డి జిన్నింగ్ మిల్లులో ముథోల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్ రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందన్నారని, మళ్లీ పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి రైతుబంధు నిలిపివేయాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో మూడు గంటలు కాదు.. మూడు పంటలు కావాలని ప్రజలు ఆలోచిస్తున్నారన్నారు. ఈ దిశలో తిరిగి మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేసేందుకు ప్రజలు అప్రమత్తమయ్యారని అన్నారు. ఒకవైపు రైతుబంధు వద్దని కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేయడంతో యాసంగి పంటకు రైతులు ఇబ్బందులు పడకుండా సీఎం కేసీఆర్ చూస్తారని ఆయన భరోసా ఇచ్చారు. అంతేగాకుండా గురువారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భైంసాను పాకిస్తాన్ ఆనడం విడ్డూరమన్నారు. ఆయన భైంసాలో ఎన్నికల ప్రచారానికి వస్తే ప్రజలకు క్షమాపణ చెప్పి రావాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హామీలన్నీ బూటకమేనన్నారు. ఇలాంటి హామీలతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చి విఫలమయ్యారని విమర్శించారు. పదేళ్లలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు సైతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. ముథోల్ అభ్యర్థి విఠల్ రెడ్డిని గెలిపించి కేసీఆర్‌ను సీఎం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మురళిగౌడ్, మాజీ జడ్పీటీసీ సూర్యకాంత్ రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జేకే పటేల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పీ కృష్ణ, సహకార సంఘం వైస్ చైర్మన్ చాకేటి లస్మన్న, నాయకులు రమణ రెడ్డి, రమేశ్, మాశెట్టి వార్, భైంసా మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



**మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్**

## ప్రజలంతా బీఆర్ఎస్ వైపే..



**వాస్తాపూర్‌లో ప్రచారం చేస్తున్న అల్లోల దివ్యగౌతంరెడ్డి**

మామడ, అక్టోబర్ 27 : బీఆర్ఎస్ పాలనలోనే గడపగడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ప్రజలంతా పార్టీపై విశ్వాసంతో ఉన్నారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కోడలు అల్లోల దివ్యగౌతంరెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా మామడ మండలం వాస్తాపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాస్తాపూర్, తాండ్ర, రాశిమెట్ల, తోటిగూడ, బూరుగుపెల్లి, గొండుగూడ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. గ్రామస్తులు సంప్రదాయ నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు.బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌గౌడ్, రైతు బంధు సమతి మండల కన్వీనర్ కాలగిరి గంగారెడ్డి, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు

ఉట్నూర్, అక్టోబర్ 27: తెలంగాణలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఇతర పార్టీల నాయకులు, కులస్తులు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ అన్నారు. ఉట్నూర్ మండలానికి చెందిన వడ్డెర సంఘం కులస్తులు శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**గులాబీ కండువా కప్పుతున్న ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్**